తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

12-08-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 185

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

సిరి People's Voice

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575







# విద్యుత్ శాఖలో వర్క్ ఆర్డర్

- ఓపెన్‌కు డబ్బులే.. క్లోజ్‌కూ డబ్బులే!
- సంగారెడ్డి విద్యుత్ శాఖ డివిజన్ కేంద్రంగా సాగుతున్న దందా
- రెండు చేతులా కాసులు ఆర్జిస్తున్న కేస్ వర్కర్ల ఇష్టారాజ్యం
- కాంట్రాక్టర్లకు ఇంజినీర్లకు చుక్కలు చూపిస్తున్న అధికారులు
- ఒక్కో వర్క్ ఆర్డర్ పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసిన తీరు
- పోటీ వాతావరణాన్ని అదునుగా చేసుకుని అక్రమ దోపిడీ
- అడిగినంత ఇస్తేనే రిలీజ్.. లేకుంటే తిరకాసులు పెడుతున్న కేస్ వర్కర్
- పనులు పూర్తయ్యాక క్లోజింగ్ కోసమూ ఇంజినీర్ల నుంచి కాసుల వేట
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

విద్యుత్ శాఖలో అవినీతి ఒక్క విభాగానికే పరిమితం కాకుండా శాఖ అంతటా వేళ్లూనుకుంటోంది. ఏ పని కావాలని ఎక్కడికి వెళ్లినా.. 'ఎందెందు వెతికినా అందందే కలదు అవినీతి' అన్న చందంగా పరిస్థితులు తయారయ్యాయి. సాధారణంగా విద్యుత్ శాఖలో ఒక్క ఇంజనీరింగ్ విభాగంలోనే ఎక్కువగా అక్రమాలు ఉంటాయని విమర్శలు వస్తుంటాయి. కానీ ఇక్కడ మాత్రం ఓ వైపు కాంట్రాక్టర్లను, మరోవైపు క్షేత్రస్థాయి ఇంజినీర్లను సైతం కాసుల కోసం కేస్ వర్కర్లు, అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి సర్కిల్ కేంద్రంగా ఉన్న వర్క్ ఆర్డర్ విభాగం ఇన్చార్జిల వ్యవహారం ఇప్పుడు సర్కిల్ పరిధిలోని కాంట్రాక్టర్లకు, సెక్షన్ ఇంజినీర్లకు పెద్ద శరాఘాతంగా మారింది.

**ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్!**

సంగారెడ్డి సర్కిల్ పరిధిలో పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట డివిజన్లు ఉండగా.. ఒక్క సంగారెడ్డి డివిజన్లో మాత్రం కాంట్రాక్టర్లకు వర్క్ ఆర్డర్

మిగతా 2వ పేజీలో..



## విద్యుత్ నిర్వహణ పనులను వేగవంతం చేయండి!

- వినాయక ఆలయ ఆవరణలోని డీటీఆర్ బయటకు తరలింపు
- గాంధీ స్టాచ్యూ ఫీడర్ ట్రిప్పింగ్‌లపై ప్రత్యేక తనిఖీలు చేయాలి
- వాక్ అలోంగ్ ది లైన్ కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలి
- సికింద్రాబాద్ సర్కిల్ లాలాగూడ బస్తీల్లో సీఎండీ పర్యటన

**హైదరాబాద్, సిరి న్యూస్:**

నగర ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా జరిగేలా నిర్వహణ పనులను వేగవంతం చేయాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ శ్రీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఆయన సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని లాలాగూడ బస్తీల్లో

మిగతా 2వ పేజీలో..

## కొంత మంది దౌర్భాగ్యుల వల్లే పార్టీ మారాల్సి వచ్చింది

- నేను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదు
- ప్రజల కోసమే ఇష్టం లేకున్నా పార్టీ మారాను
- నిధుల కోసం కుమారుడిని పంపిస్తే కండువా మార్చుకోమన్నారు
- ముఖ్యమంత్రి, మంత్రులు ఫోన్ ఎత్తడం లేదు
- మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

2





## ఉజ్జయిన మహంకాళికి మారు బోనం

- సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి సురేఖ

2



## కొత్త ఉత్సాహాన్నిస్తోన్న 'నవ భారత యువభేరి'

- 13 ఏళ్ల నాటి ఘట్టాన్ని గుర్తు చేసుకున్న కిషన్‌రెడ్డి

## రాష్ట్రంలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్

- కేంద్ర మంత్రికి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు
- ఒక్కో ఇంటిపై రూ.50 వేల తేడా ఉందని వెల్లడి
- పార్లమెంట్ స్తంభనపై విపక్షాల తీరును తప్పుబట్టిన రఘునందన్‌రావు

3



## పత్తి కొనుగోళ్లలో రైతుకు ఇబ్బందులుండొద్దు

3



## 73 లక్షల ఓట్లు పోయినట్టే

- తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి
- 3.38 కోట్లకు చేరిన ఓటర్ల సంఖ్య
- 2.64 కోట్ల ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- 45.18 లక్షల మంది శాశ్వత వలస
- 9.22 లక్షల మంది మృతి చెందినట్టు నమోదు
- 11.25 లక్షల మందికి ఆచూకీ లేకుండా..

3

## జీనోమ్ వ్యాలీలో యామ్లైన్

- 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు
- హర్షం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు

3



3

## రిజర్వాయర్లు అడుగంటాయ్.. రైతులను ఆదుకోండి



## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేద్దాం: మోదీ

- అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేయాలని పిలుపు

4

## గడువులోగా ఉప్పల్ కారిడార్ పూర్తి కావాల్సిందే



- నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదు
- ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం చేసి తీరాల్సిందే
- అధికారులు.. మనసుపెట్టి పనిచేయండి
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్ :**

ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని, నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉప్పల్ మీదుగా వరంగల్ వైపు ప్రయాణించే వారికి ఆ రహదారి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని, అందుకోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం.. ఆ ప్రకారం చేసి తీరాల్సిందేనని మంత్రి పునరుద్ఘాటించారు. ప్రజలకు ట్రాఫిక్

మిగతా 2వ పేజీలో..

# విద్యుత్ శాఖలో వర్క్ ఆర్డర్

మొదటిపేజీ తరువాయి

అనేది అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇక్కడ వర్క్ ఆర్డర్ చూసే సదరు అధికారి ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి, ఆ పైసల్లో ఏమాత్రం తేడా వచ్చినా వర్క్ ఆర్డర్ రిలీజ్ చేయడానికి రక రకాల సాకులు చెబుతున్నాడని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టర్న్ కీ వర్క్ అయితే పని తీవ్రతను బట్టి రూ. 2వేల నుండి రూ.6వేల వరకు వర్క్ ఆర్డర్ రిలీజ్ చేయడం కోసమే లంచాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**పోటీని అదునుగా చేసుకుని**

**దండుకుంటున్న వైనం**

విద్యుత్ శాఖలో ప్రైవేటు పనులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఆ పనులను దక్కించుకోవడం కోసం కాంట్రాక్టర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంటుంది. దీంతో కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఒప్పుకున్న గడువులోనే పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. అందుకోసం మంజూరైన పనులకు కావలసిన విద్యుత్ సామాగ్రిని సాధ్యమైనంత త్వరగా స్టోర్స్ నుండి డ్రా చేయాల్సి ఉంటుంది. దీనికి తప్పనిసరిగా 'వర్క్ ఆర్డర్' ఓపెన్ కావాల్సిందే. ఈ అత్యవసరాన్ని అదునుగా భావిస్తున్న సదరు అధికారి తాను చెబినంత ఇస్తేనే ఫైలు ముందుకు కదుపుతున్నారు. ఒకవేళ ఫిక్స్ చేసిన రేట్లలో తేడా వస్తే, అన్ని నిబంధనలు అనుసరించినా పని కాదని, అడిగినంత ఇస్తే నిబంధనలు పాటించకపోయినా వర్క్ ఆర్డర్ ఓపెన్ అయిపోతుందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

**సెక్షన్ ఇంజినీర్లకూ తప్పని తిప్పలు**

ఒక పని మొదలు పెట్టడానికి వర్క్ ఆర్డర్ కాంట్రాక్టరుకు ఎంత ముఖ్యమో, పనులు పూర్తయిన తర్వాత ఆ వర్క్ ఆర్డర్‌ను అధికారికంగా క్లోజ్ చేయడం సంబంధిత సెక్షన్ అధికారులకు అంతే ముఖ్యం. ఇక్కడ వర్క్ ఆర్డర్ క్లోజింగ్ కూడా సదరు అధికారికి కాసుల పంట పండిస్తోంది. కాంట్రాక్టర్ల దగ్గర ఎంత కచ్చితంగా వసూలు చేస్తారో, సెక్షన్ అధికారుల




వద్ద క్లోజింగ్ చేయాలన్నా అంతే స్థాయిలో లంచాలు గుంజుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమయం ప్రకారం వర్క్ ఆర్డర్ క్లోజ్ చేయకపోతే ఉన్నతాధికారుల నుండి తీవ్ర ఒత్తిడి రావడంతో పాటు, మెమో లు ఇస్తారు.ఒకవేళ సర్కిల్ దాటి బదిలీ అయితే నెల జీతం కూడా ఆగిపోతుంది. దీంతో వేరే దారి లేక సెక్షన్ అధికారులు కూడా సదరు వర్క్ ఆర్డర్స్ ఇంచార్జి అడిగినంత ఇస్తూ వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయించుకుంటున్నారు. దీనిపై కొందరు ఇంజినీర్లు ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినా చర్యలు లేకపోవడం గమనార్హం. ఇటీవల వరుస అవినీతి ఉదంతాలు బయటకొచ్చిన సంగారెడ్డి సర్కిల్‌లో, ఈ వర్క్ ఆర్డర్ దోపిడీపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులైనా స్పందించి ఈ దోపిడీకి చెక్ పెడతారని కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు ఆశిస్తున్నారు.



## విద్యుత్ నిర్వహణ పనులను

# వేగవంతం చేయండి!

మొదటిపేజీ తరువాయి

పర్యటించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో నిర్వహణ పనులను ముమ్మరం చేయాలని సూచించారు. అనంతరం వడ్డెర బస్తీని సందర్శించిన సీఎండీ, పంపిణీ వ్యవస్థను స్వయంగా పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పర్యటన సందర్భంగా వడ్డెర బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ను సీఎండీ పరిశీలించారు. సమీపంలో పిల్లలు సంచరించే అవకాశం ఉన్నందున, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని డీటీఆర్ చుట్టూ వెంటనే ఎఫ్‌ఆర్‌పీ (ఫైబర్ రీఇన్‌ఫోర్స్డ్ ప్లాస్టిక్) ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్థానిక వినాయక ఆలయ ప్రాంగణంలో ఉన్న డీటీఆర్ వల్ల ప్రజల రాకపోకలకు ఆటంకం కలకుండా, భద్రతా ప్రమాణాలకు లోబడి దానిని ఆలయ ఆవరణ వెలుపల అనువైన ప్రదేశానికి తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. లైన్లు, డీటీఆర్‌లు, ఫీడర్లు, స్తంభాల నిర్వహణ పనులను నిరంతరం చేపట్టడం ద్వారా విద్యుత్ కోతలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. సీతాఫల్‌మండి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గాంధీ స్టాచ్యూ ఫీడర్‌లో తరచూ సంభవిస్తున్న ట్రిప్పింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర తనిఖీలతో అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 'వాక్ అలోంగ్ ది లైన్' కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలని సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ప్రతి విద్యుత్ లైన్, డీటీఆర్, ఫీడర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ లోపాలను ముందే గుర్తించి సరిదిద్దాలన్నారు. చెట్ల కొమ్మల తొలగింపు, లూజ్ లైన్ల బిగింపు, డీటీఆర్ యార్డుల శుభ్రత, తీగలకు అల్లుకున్న తీగల తొలగింపు, వంగిపోయిన స్తంభాల సరిదిద్దడం వంటి పనులను నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఈ పర్యటనలో సీఎండీతో పాటు టీజీఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్. నర్సింలు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ పి. కరుణాకర్ బాబు, సికింద్రాబాద్ ఎస్‌ఈ ఎల్. గోపయ్య, పారడైజ్ డీఈ చి. బ్రహ్మానందం, ఏడీఈలు రమణయ్య, శ్రీ ఆదినారాయణ, ఏఈలు బాలరాజు, కిష్టయ్య, సబ్ ఇంజనీర్ నరేష్, ఓఅండ్ఎమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొంత మంది దౌర్భాగ్యుల వల్లే పార్టీ మారాల్సి వచ్చింది

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

ప్రభుత్వ పెద్దల తీరుపై మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనకు ఇష్టం లేకపోయినా అభివృద్ధి పనులు ఆగకూడదనే ఉద్దేశంతోనే పార్టీ మారానని, అయితే తాను మాత్రం కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత నిధుల మంజూరు కోసం తన కుమారుడు భాస్కర్ రెడ్డిని ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి దగ్గరికి పంపానని, అయితే 'మీ నాన్నకు కండువా మార్చుకోమనండి.. లేదంటే చిల్లిగవ్వ కూడా ఇవ్వము' అని ఆయన అన్నట్లు తన కుమారుడు తనకు చెప్పాడని పోచారం తెలిపారు. ఎంతో గుర్తింపునిచ్చిన పార్టీని వీడటం, కేసీఆర్‌ను మోసం చేయడం తన వయసుకు తగదని భావించినా.. కొందరు దౌర్భాగ్యుల వల్లే అభివృద్ధి కోసం మనసు చంపుకుని పార్టీ మారాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇంతకుముందు అత్యున్నతమైన స్పీకర్ పదవి వచ్చిందని, అంతకు మించిన గౌరవం ఇంకేం కావాలని ఆయన ప్రశ్నించారు.

**మంత్రులు, సీఎం ఫోన్ ఎత్తడం లేదు..**

ఆరు నెలల్లో అన్ని హామీలు పూర్తి చేస్తామని చెప్పి పార్టీలో చేర్చుకున్న ముఖ్యమంత్రి ఆ తర్వాత మొహం చాటేశారని పోచారం ఆరోపించారు. ఇప్పటికీ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయంలో మంత్రులు ఎవరూ సహకరించడం లేదని విమర్శించారు. అసలు ఈ ప్రభుత్వంలో మంత్రులు, ముఖ్యమంత్రి ఫోన్ ఎత్తే పరిస్థితి కూడా లేదని మండిపడ్డారు. తాను ఎంతో గౌరవం పొందిన పార్టీని వదిలింది ప్రజల కోసమేనని, కానీ ఇప్పుడు పార్టీ మారి తప్పు చేశాననే బాధ కలుగుతోందని అన్నారు.



ఇప్పటికీ నియోజకవర్గంలో తామే బలంగా ఉన్నామని చెబుతూ.. సమావేశంలో తనను తాను భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేగా అభివర్ణించుకున్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి మరోసారి తన అసంతృప్తి గళాన్ని బహిరంగంగా విప్పడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది.



# ఉజ్జయిన మహంకాళికి మారు బోనం

హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్ :

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాU మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మంగళవారం మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో మారు బోనం సమర్పించారు. బోనమెత్తిన మహిళలకు మంత్రి సురేఖ చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.

# ప్రపంచస్థాయి విద్య.. అదే మా లక్ష్యం

- **'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 11 , సిరి న్యూస్:

భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి.. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ఎస్) వేగంగా రూపు దిద్దుకుంటున్నాయి అని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ ప్రతి చిన్నారికి ప్రపంచస్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి అని పేర్కొన్నారు.




# బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

హైదరాబాద్, సిరి న్యూస్ :



రాజీవ్ రహదారి విస్తరణ ప్రాజెక్టులో భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. కార్ఖానాలో బాధితుల ఆందోళనలో ఆయన పాల్గొని వారికి బీజేపీ తరఫున సంఘీభావం తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అందరూ సహకరిస్తున్నారని, అయితే తమ ఆస్తులను త్యాగం చేస్తున్న ప్రజలకు సరైన విలువతో కూడిన న్యాయమైన పరిహారం అందాల్సిన అవసరం ఉందని అన్నారు. తూంకుంట ప్రాంతంలో భూముల పరిహారాన్ని పెంచిన విధంగా రాజీవ్ రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న కార్ఖానా ప్రాంత ప్రజలకు కూడా తగిన మేర పరిహారం పెంచాలని ఆయన కోరారు. తూంకుంటలో పెంచిన పరిహారం కంటే ఈ ప్రాంతం మరింత ఖరీదైన అర్బన్ ప్రాంతమని, అలాంటి పరిస్థితుల్లో ఇక్కడ తక్కువ పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూంకుంట మాదిరి ఇక్కడ కూడా సముచితమైన శాతం మేర పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల న్యాయమైన డిమాండ్‌కు బీజేపీ పూర్తిగా మద్దతు ఇస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

# గడువులోగా ఉప్పల్ కారిడార్ పూర్తి కావాల్సిందే

మొదటిపేజీ తరువాయి

ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని, అందుకనుగుణంగా అధికారులు మనసు పెట్టాలని ప్రత్యేకంగా కోరారు. కార్మికుల సంఖ్య పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయాలని, రాత్రిళ్లు 11 నుండి ఉదయం 6 గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలని మంత్రి ఆదేశించారు. కారిడార్ కింద 6.25 కి.మీ బీటీ రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకో□సారి తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పురోగతి సమీక్షిస్తానని, అందుకు తగ్గట్టు రోజువారీ వర్క్ ప్రోగ్రెస్‌ను అధికారులు సమీక్షించాలని ఆదేశించారు. పనులు 60% మేర పూర్తయ్యాయని, మరో 40% పనులు వేగంగా జరుగుతున్నాయని, సైట్‌లో సెగ్మెంట్ తయారీకి నాలుగు బెడ్లు, నాలుగు గ్యాంట్రీస్‌తో 300మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారని అధికారులు, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. అటు నారపల్లి(సీపీఆర్) వైపు నుండి, ఇటు ఉప్పల్ వైపు నుండి ఇరువైపులా లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని, రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనులు, వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదని నిర్మాణ సంస్థ తెలిపింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం.. ప్రజల ఇబ్బందుల గురించి ఆలోచించాలంటూ వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తిచేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. దీనికి అను



సంధానంగా జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులపై ఆరా తీసిన మంత్రి ఆ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దసరాకు ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని, అధికారులు, వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఆర్అండ్‌బి సీఈ ధర్మారెడ్డి, పలువురు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిషేధిత భూములపై ఆందోళన వద్దు

హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్ :

నిషేధిత ఆస్తుల పీవోబీ/22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఎ/పీవోబీ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టొచ్చని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందని అన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు యాక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది సరైనది ఏది కాదు గుర్తించి సరైన వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితోపాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. పీవోబీ దరఖాస్తులకు సంబంధించి □కేసు వారీగా రోజూ సమీక్షించాలన్నారు. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి, అర్హులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు వద్దని, ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చానని అన్నారు. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదంటూ ఏ చిన్న తప్పు చేసినా క్షమించేదిలేదు.. కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కలెక్టర్ దృష్టికి గాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలన్నారు. పీవోబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలన్నారు. పీవోబీకి సంబంధించి వచ్చిన ప్రతీ దరఖాస్తును ఇకనుండి తహసీల్దార్‌కు కాకుండా నేరుగా కలెక్టర్‌కే పంపాలి.. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి అని చెప్పారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి.. వీటిని సమీకృతం చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారనే ఫిర్యాదుల వస్తున్నాయన్నారు. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# రిజర్వాయర్లు అడుగంటాయ్.. రైతులను ఆదుకోండి

సిద్దిపేట, ఆగస్టు 11, సిరి న్యూస్:

సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నిల్వ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కోరారు. వచ్చే ఏడాది జూలై వరకు జిల్లాలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరత తను అధిగమించేందుకు ముందస్తు చర్యలు అత్యవసరమని పేర్కొంటూ కలెక్టర్ కు లేఖ రాశారు. జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో హరీశ్రావు రాసిన లేఖలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు, రైతుల సాగు పరిస్థితి, తాగునీటి అవసరాలు, భూగర్భజలాల పరిస్థితి, రానున్న యాసంగి పంటకు నీటి లభ్యత తదితర అంశాలను ప్రస్తావించారు.

**రిజర్వాయర్ల పరిస్థితి ఆందోళనకరం**

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను నిర్మించుకున్నామని హరీశ్ రావు తెలిపారు. సాధారణంగా ఏటా ఈ సమయానికి మిమ్మానేరు రిజర్వాయర్ నుంచి వీటికి నీటిని ఎత్తిపోసేవారని, ఈసారి ఇప్పటివరకు ఎత్తిపోతలు ప్రారంభించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కూడా అడుగంటిన పరిస్థితిలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నింపాలని హరీశ్రావు కోరారు. రిజర్వా యర్ల నుంచి చెరువులు, కుంటలు, చెక్ డ్యాములను నింపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి ప్రస్తుత వానాకాలం పంటలకు రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

**65 శాతానికే వానాకాలం సాగు**

ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు 65 శాతం మంది రైతులే వానాకాలం పంటలు సాగు చేశారని హరీశ్ రావు తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు గట్టెక్కాలన్నా రిజర్వాయర్లను నింపడం అత్యవసరమని, రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. 2027 జూలై వరకు ఎల్నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో అప్పటివరకు సాగు, తాగునీటికి కొరత రాకుండా ఇప్పటి నుంచే నీటి నిల్వలపై దృష్టి పెట్టాలని లని హరీశ్రావు సూచించారు. ప్రస్తుత అవసరాల కోసం నీటిని వినియోగించిన అనంతరం మళ్లీ ఎత్తిపోసుకునే అవకాశం ఉండేలా మిడ్మానేరు రిజర్వాయర్లో జిల్లాకు సరిపడ నీటిని నిల్వ ఉంచాలని కోరారు. వచ్చే యాసంగి పంట కాలంలో అవసరమైనప్పుడు మిడ్మానేరు నుంచి నీటిని ఎత్తిపోసుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని హరీశ్రావు కోరారు.

**తాగునీటికి 6 నుంచి 7 టీఎంసీలు అవసరం**

జిల్లాలో తాగునీటి అవసరాలకే సుమారు 6 నుంచి 7 టీఎంసీల నీరు అవసరమవుతుందని హరీశ్రావు తెలిపారు. వరి, పామాయిల్, ఇతర పంటలు సాగు చేసిన రైతులు నీటి ఎత్తిపోతల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రైతులు నీటిని ఎత్తిపోస్తారని ఆశగా ఎదు రుచూస్తున్న సమయంలో రిజర్వాయర్ల దుస్థితిని చూస్తే బాధగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం ఉన్న సమయంలోనే వడివడిగా నీటిని ఎత్తిపోసి ఉంటే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని హరీశ్రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జిల్లాలోని వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నీటిని జిల్లాకు అందుబాటులోకి తీసుకురావా లని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హరీశ్ రావు సూచించారు. వొచ్చే వేసవిని దృష్టిలో పె ట్టుకుని ఇప్పటి నుంచే రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయడమే తక్షణ ప్రాధాన్యతగా ఉండాలని హరీశ్రావు తన లేఖలో స్పష్టం చేశారు.

# 73 లక్షల ఓట్లు పోయినట్టే

హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటివరకు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా.. నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. మరోవైపు 73.39 లక్షల ఫారాలు వివిధ కారణాలతో సేకరించలేకపోయినట్టు అధికారులు తేల్చారు.

**73.39 లక్షల ఫారాలు అన్‌కలెక్టబుల్**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులోకి రాలేదు. ఇవి మొత్తం ఓటర్లలో 21.70 శాతంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనలో ఓటర్లు నివాసాలు మార్చడం, మరణించడం, చిరునామాలు లభించకపోవడం, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదు కావడం వంటి కారణాలు ప్రధానంగా వెలుగుచూశాయి.

**45.18 లక్షల మంది శాశ్వత వలస**

అన్‌కలెక్టబుల్ ఫారాల్లో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ పాత నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు గుర్తించారు. వీరి వివరాలు ప్రస్తుత చిరునామాలకు అనుగుణంగా మారే అవకాశం ఉంది. దీంతో తుది జాబితాలో ఓటర్ల సంఖ్య, నియోజకవర్గాల వారీగా నమోదులో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

**9.22 లక్షల మంది మృతి**

ఎన్యూమరేషన్ సందర్భంగా 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్టు నమోదైంది. వీరి పేర్లు తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టనున్నారు. మరో 11.25 లక్షల మంది ఓటర్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఆచూకీ లభించలేదని అధికారులు గుర్తించారు.

**ఇప్పటికే మరోచోట నమోదు**

సుమారు 6.70 లక్షల మందికిపైగా ఓటర్లు ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక తుది ఓటర్ల జాబితా ప్రస్తుత జాబితాతో పోలిస్తే గణనీయంగా మారే అవకాశం ఉంది.

# పత్తి కొనుగోళ్లలో రైతుకు ఇబ్బందులుండొద్దు

- 15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించాలి
- జిల్లా మానిటరింగ్ కమిటీల్లో రైతులను భాగస్వాములను చేయాలి-
- 'కపాస్'లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళతరం చేయాలి
- సీసీఐ అధికారులతో సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్ :

రాష్ట్రంలో 202627 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో మంగళవారం ఇక్కడ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, వ్యవస్థలకు చెడ్డ పేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మనం బతకాలంటే రైతు బతకాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్లి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమన్నారు. సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సీజన్‌లో అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. లాంగ్ స్టేపుల్ పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ఎంఎస్‌పీ ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు అంతకంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎల్ 1 నుంచి ఎల్ 12 వరకు అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గత సీజన్‌లో 122 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉండగా ఈ సీజన్‌లో 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్‌కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, మిల్లుల వద్ద అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకనుగుణంగా పొడిగించాలని సూచించారు.

**'కపాస్' బుకింగ్‌ను సరళతరం చేయాలి**

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుల్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలన్నారు. పంట బుకింగ్ డేటాను ఎనఐసీ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు అత్యంత వేగంగా బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి దానికంటే అధిక దిగుబడి పొందిన రైతులకు ఏఈవోల ద్వారా డిజిటల్ ఈల్డ్ సర్టిఫికెట్స్ వెంటనే జారీ చేయాలని మంత్రి సూచించారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే జిల్లాల్లో అవసరమైన మేరకు కాటన్ టెస్టింగ్ ల్యాబులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో స్టేపుల్ లెంగ్త్, మైక్రోనైర్, తేమ శాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు తప్పనిసరిగా పనిచేసేలా చూడాలన్నారు. ఎంఎస్‌పీపై పూర్తి అవగాహన కల్పించాలని, రైతు నేస్తం, గ్రామస్థాయి కార్యక్రమాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా సీసీఐ కొనుగోలు కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రైతుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను రైతులు వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ లేదా పెండింగ్ ఏర్పడినప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రైతుకు ఎంఎస్‌పీ అందించడమే ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో ఏ స్థాయిలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని మంత్రి హెచ్చరించారు.

# రాష్ట్రంలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్

హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ స్కామ్‌కు పాల్పడిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉచిత విద్యుత్ పేరుతో కేంద్రం అందిస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆయన ఆరోపించారు.

**40 వేల ఇళ్లకు ప్యానెళ్లు**

'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన' కింద రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించే 40 వేల ఇళ్లను గుర్తించి సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘునందన్‌రావు తెలిపారు. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ఏర్పాటు కోసం ఓ సంస్థకు రూ.1,36,000 చొప్పున కాంట్రాక్టు ఇచ్చారని చెప్పారు.

**సబ్‌కాంట్రాక్టుతో రూ.50 వేల తేడా**

కాంట్రాక్టు పొందిన సంస్థ అదే పనిని మరో సంస్థకు రూ.86,000కే సబ్‌కాంట్రాక్టు ఇచ్చిందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. దీంతో ఒక్కో ఇంటిపై రూ.50 వేల వ్యత్యాసం ఏర్పడుతోందని తెలిపారు. 40 వేల ఇళ్లకు ఇదే విధానం వర్తిస్తే రూ.200 కోట్ల మేర అవినీతికి అవకాశం ఏర్పడిందని ఆరోపించారు.

**కేంద్ర సబ్సిడీపై ప్రశ్నలు**

సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున సబ్సిడీ అందిస్తోందని రఘునందన్‌రావు తెలిపారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదంటూ కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వడంతోపాటు వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు. లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**పార్లమెంట్ స్తంభనపై విమర్శలు**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపైనా రఘునందన్‌రావు స్పందించారు. సభను నడిపించడంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలకు సమాన బాధ్యత ఉందన్నారు. ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు సరైన అంశం లేక రోజూ సభలో ఆందోళన చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి కూడా దీనిపై సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విపక్షాల నిరసనల కారణంగా ఇతర ఎంపీలు ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




# జీనోమ్ వ్యాలీలో యామైన్

హైదరాబాద్, ఆగస్ట్ 11, సిరి న్యూస్:

గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామైన్' జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరి శోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయ డానికి ముందుకొచ్చింది. ఈ మేరకు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో మంగళవారం ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామైన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామైన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్ర మల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకా శాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భం గా వెల్లడించారు. యామెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణ పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వా నికి దక్కిన గౌరవమని అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామైన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామైన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత పాల్గొన్నారు.

# కొత్త ఉత్సాహాన్నిస్తోన్న నవ భారత యువభేరి

హైదరాబాద్, ఆగస్టు 11 , సిరి న్యూస్:

దేశ గతిని మలుపు తిప్పి దేశ రాజకీయాల్లో సరికొత్త శకానికి బీజం వేసిన చారిత్రక ఘట్టానికి 13 ఏళ్లు.. బీజేపీ జాతీయ ప్రచార కమిటీ చైర్మన్‌గా, ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎంపికైన తర్వాత నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 'నవభారత యువభేరి' వేదికగా సరిగ్గా ఇదేరోజు(11 ఆగస్టు, 2013 నాడు) ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించిన దృశ్యాలు ఇవాల్టికీ కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయి అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఫేస్‌బుక్‌లో నాటి అనుభవాన్ని పోస్టు చేశారు. పబ్లిక్ మీటింగ్స్ చరిత్రలోనే తొలిసారిగా డెలిగేషన్ ఫీజును చెల్లించి మరీ లక్షలాదిమంది ఎల్‌బీ స్టేడియానికి తరలి వచ్చి నరేంద్రమోదీకి తమ సంపూర్ణమైన మద్దతును తెలియజేశారన్నారు. నాడు మన హైదరాబాద్ వేదికగా పడిన నరేంద్రమోదీ తొలి అడుగు తర్వాత దేశ రాజకీయాల్లో బీజేపీ సంచలన విజయాలతో దినదిన ప్రవర్ధమానమైందని, వారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇవాళ 'వికసిత భారత్ సంకల్పం2047' లక్ష్యాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతోందని తెలిపారు. ఈ చారిత్రకమైన సందర్భంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న తాను 13 ఏళ్ల నాటి ఆ అద్భుతమైన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నానన్నారు.

# చార్మినార్ వద్ద నకిలీ రాపిడో డ్రైవర్ హల్‌చల్

- అప్రమత్తతతో మోసాన్ని గుర్తించిన యువతి
- నంబర్ ప్లేట్, డ్రైవర్ ఐడీ లేకపోవడంతో అనుమానం
- అక్కడికక్కడే రాపిడో యాప్ డౌన్‌లోడ్ చేసిన వ్యక్తి
- వీడియో ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేసిన యువతి
- భద్రతా వివరాలు తనిఖీ చేసుకోవాలని రాపిడో సూచన

హైదరాబాద్, ఆగస్టు 11, సిరి న్యూస్

చార్మినార్ సమీపంలో రాత్రివేళ ఓ యువతిని రాపిడో డ్రైవర్ పేరుతో ఓ వ్యక్తి నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడం, డ్రైవర్ గుర్తింపు కార్డు చూపించకపోవడంతో ఆమె అనుమానించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి అతడి అసలు వ్యవహారాన్ని గుర్తించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. ఈ ఘటన ప్రయాణికుల భద్రతపై మరోసారి ఆందోళనకు దారితీసింది.

**ఐడీ అడగడంతో అసలు విషయం..**

కంటెంట్ క్రియేటర్ సిద్ధేశ్వరి సుగంత్ రాత్రి 9 గంటల సమయంలో చార్మినార్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తుండగా స్కూటర్‌పై వచ్చిన వ్యక్తి రాపిడో కావాలా అని అడిగాడు. అయితే అతడి వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడాన్ని ఆమె గమనించింది. డ్రైవర్ ఐడీ కార్డు చూపించాలని కోరగా అతడు తడబడినట్టు ఆమె తెలిపింది.

**అక్కడే యాప్ డౌన్‌లోడ్..**

అనుమానం వ్యక్తం చేయడంతో ఆ వ్యక్తి తన ఫోన్‌లో ప్లే స్టోర్ తెరిచి రాపిడో యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. వాహనం స్టార్ట్ కావడం లేదంటూ విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేశాడు. ఫోన్‌ను పరిశీలించగా యాప్ అప్పుడే లాగిన్ అవుతూ ఓటీపీ పేజీలో ఉన్నట్టు గుర్తించింది. దీంతో అతడు నిజమైన రాపిడో డ్రైవర్ కాదని సిద్ధేశ్వరి నిర్ధారించుకుంది.

**గట్టిగా హెచ్చరించిన యువతి**

బుకింగ్ లేకుండా తనను బైక్‌పై రావాలని కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సిద్ధేశ్వరి.. మర్యాదగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని అతడిని హెచ్చరించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న ఆమె.. ఎలాంటి బుకింగ్, ధ్రువీకరణ లేకుండా ఓ వ్యక్తి ఇలా ప్రయాణికురాలిని ఎక్కించుకునేందుకు ప్రయత్నించడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది.

**ప్రయాణికులకు రాపిడో సూచనలు**

ఈ ఘటనపై స్పందించిన రాపిడో సంస్థ.. సిద్ధేశ్వరి అప్రమత్తతను అభినందించింది. యాప్‌లో రైడ్ బుక్ చేయకుండా నేరుగా వచ్చి తాము డ్రైవర్లమని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని వినియోగదారులను హెచ్చరించింది. ప్రయాణం ప్రారంభించే ముందు యాప్‌లో కనిపించే డ్రైవర్ గుర్తింపు, వాహన నంబర్, ఓటీపీ వివరాలను తప్పనిసరిగా సరిపోల్చుకోవాలని సూచించింది.






## రూ.10, రూ.20 నోట్లకు

# పాలిమర్ రూపం

- రూ.200 కోట్ల నోట్లతో ప్రయోగాత్మక పరిశీలనకు కేంద్రం ఆమోదం
- కాగితపు నోట్లతో పాటే సమాంతరంగా చలామణి

న్యూఢిల్లీ, ఆగస్టు 11, సిరి న్యూస్

తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్ల మన్నికను పెంచేందుకు రూ.10, రూ.20 పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం1934లోని సెక్షన్ 25 ప్రకారం వచ్చిన ప్రతిపాదన మేరకు 200 కోట్ల పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి పరిశీలన కోసం ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో వెల్లడించారు.

**కాగితపు నోట్లతో కలిసే చలామణి**

ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందని మంత్రి తెలిపారు. పాలిమర్ నోట్ల అధికారిక విడుదల తేదీ, తయారీ వ్యయం వంటి వివరాలు ఇంకా ఖరారు కాలేదని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వీటిని చలామణిలోకి తీసుకురావాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్లు వివరించారు.

**మన్నిక ఎక్కువ.. చిరిగే అవకాశం తక్కువ**

ప్రపంచంలోని పలు దేశాల్లో మూడు దశాబ్దాలుగా పాలిమర్ కరెన్సీ వినియోగంలో ఉందని ప్రభుత్వం తెలిపింది. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయని పేర్కొంది. ముఖ్యంగా తరచూ చేతులు మారే రూ.10, రూ.20 నోట్లు త్వరగా పాడవకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడనుంది.

**ద్రవ్యోల్బణం అదుపులోనే**

దేశ ఆర్థిక పరిస్థితిపైనా నిర్మలా సీతారామన్ వివరాలు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం, వాతావరణ మార్పుల ప్రభావంతో 202627 తొలి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.9 శాతానికి చేరినా.. ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యానికి లోపలే ఉందని చెప్పారు. జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణతో పన్ను భారం తగ్గిందని, వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపుతో ప్రజల ఖర్చు సామర్థ్యం పెరిగిందని తెలిపారు. దీంతో ప్రైవేట్ వినియోగం పుంజుకోవడంతో పాటు తక్కువ, మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తికి ఊతం లభిస్తోందని పేర్కొన్నారు.

## చైనా అభ్యంతరాలపై భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

- అరుణాచల్ ప్రదేశ్ మాదే.. ఎవరూ మార్చలేరు

న్యూఢిల్లీ, ఆగస్టు 11, సిరి న్యూస్

అరుణాచల్ ప్రదేశ్‌లోని 27 ప్రాంతాలకు భారత్ అధికారికంగా పేర్లు పెట్టడంపై చైనా చేసిన అభ్యంతరాలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని, ఈ వాస్తవాన్ని ఎలాంటి చర్యలతోనూ మార్చలేరని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**27 ప్రాంతాలకు అధికారిక గుర్తింపు**

అరుణాచల్‌లోని 27 గ్రామాలు, భౌగోళిక ప్రాంతాలకు భారత్ అధికారిక పేర్లు ప్రకటించింది. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో వాటిని నమోదు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల గుర్తింపును మరింత స్పష్టం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచడం లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

**చైనా తీవ్ర అభ్యంతరం**

భారత్ నిర్ణయాన్ని చైనా విదేశాంగ శాఖ తప్పుబట్టింది. అరుణాచల్‌ను 'సౌత్ టిబెట్', 'జాంగ్నాన్'గా పేర్కొంటున్న చైనా.. భారత చర్యను చట్టవిరుద్ధమైనదిగా అభివర్ణించింది.

**పేర్లు పెడితే వాస్తవాలు మారవు**

చైనా గతంలోనూ అరుణాచల్‌లోని పలు ప్రాంతాలకు పేర్లు పెట్టింది. అయితే చైనా ప్రకటించే కల్పిత పేర్లతో భౌగోళిక వాస్తవాలు మారవని భారత్ స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ తమ దేశంలో విడదీయరాని భాగమనే విషయంలో ఎలాంటి సందేహం లేదని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

**ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం**

భారత్‌చైనా సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఇలాంటి చర్యలు ఆ ప్రక్రియకు ఆటంకం కలిగించే అవకాశం ఉందని భారత్ పేర్కొంది.



## యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు ఉండవు

- కమ్యూనిస్టుల అబద్ధాల ప్రచారం తగదన్న నిర్మల

న్యూదిల్లీ, ఆగస్టు 11, సిరి న్యూస్:

రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు చార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయబోరన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రఽ భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీన్ని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. చార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి.. ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా అప్పటినుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత.. వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు.

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేద్దాం: మోదీ

- అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేయాలని పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 11, సిరి న్యూస్



స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవం, గర్వం, ఘనతతో జరుపుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం సంకల్పం తీసుకోవాలని కోరారు. మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఈ సందేశాన్ని వెల్లడించారు.

**ఇంటింటా జాతీయ జెండా**

"హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా" అంటూ మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించాలని సూచించారు. దేశభక్తి స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

**ఎన్డీఏ నేతల ఘన స్వాగతం**

పార్లమెంట్ హౌస్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు, కేంద్ర మంత్రులు త్రివర్ణ పతాకాలను చేతబూని 'వందే మాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో ఆయనకు స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన వీడియోను మోదీ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

**సమావేశంలో పలువురు నేతలు**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ సమావేశానికి హాజరయ్యారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నేతలు, ఎంపీలు కూడా పాల్గొన్నారు.

## ఆంక్షల వ్యసనంలో అమెరికా

- దౌత్య మార్గంలో విఫలంతో ఆంక్షల కొరడా
- ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి

టెహ్రాన్, ఆగస్ట 11, సిరి న్యూస్:




తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసు కోవడం సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు. ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

## అమిత్ షా లోక్‌సభకు రాలేదు

- పిరికి వాడంటూ జైరామ్ రమేశ్ పోస్ట్

న్యూఢిల్లీ, ఆగస్ట 11, సిరి న్యూస్:

విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స' వేదికగా పోస్టు పెట్టారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? 1, 2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.



## జనగణమన తరహాలో

# వందేమాతరం

- చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూదిల్లీ, ఆగస్టు 11, సిరి న్యూస్:

భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది.కొత్త చట్టం ప్రకారం 'వందేమాతరం'గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
- పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపీల పరస్పర నినాదాలు

న్యూఢిల్లీ, ఆగస్ట 11, సిరి న్యూస్:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గం దరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను స జావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యా హ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల ని నాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హావి□ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగా ర్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై కేంద్రం కీలక నిర్ణయం

- జేపీసీ పరిశీలనకు పంపించాలని నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 11, సిరి న్యూస్



విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బిల్లులో ప్రతిపాదించిన మార్పులు, నిబంధనలను సమగ్రంగా పరిశీలించేందుకు జేపీసీకి అప్పగించే ప్రక్రియను చేపట్టనుంది.

**విదేశీ నిధులపై నియంత్రణ**

విదేశాల నుంచి వచ్చే విరాళాలు, వాటి వినియోగం, విదేశీ నిధులు స్వీకరించే సంస్థల కార్యకలాపాలపై నియంత్రణను మరింత పటిష్ఠం చేయడమే సవరణల ప్రధాన ఉద్దేశంగా కేంద్రం పేర్కొంది. నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా నిబంధనల్లో మార్పులు ప్రతిపాదించింది.

**విస్తృత పరిశీలనకు అవకాశం**

బిల్లును జేపీసీకి పంపడంతో ప్రతిపాదిత నిబంధనలపై అధికార, విపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఏర్పడింది. కమిటీ అవసరాన్ని బట్టి అధికారులు, నిపుణులు, సంబంధిత సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను సేకరించి బిల్లులోని అంశాలను పరిశీలించనుంది.

**పార్లమెంట్‌కు నివేదిక**

జేపీసీ పరిశీలన పూర్తయిన తర్వాత తన సిఫారసులతో కూడిన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉంది. కమిటీ సూచనల ఆధారంగా బిల్లులో అవసరమైన మార్పులు చేసే అవకాశం కూడా ఉంటుంది.

**తదుపరి ప్రక్రియపై ఆసక్తి**

ఎఫ్‌సీఆర్‌ఏ చట్టం కింద విదేశీ నిధులు స్వీకరించే సంస్థలపై పలు నియంత్రణలు అమలులో ఉన్నాయి. నిధులు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణను బలోపేతం చేయడంపై సవరణల్లో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జేపీసీ పరిశీలన నేపథ్యంలో బిల్లుపై పార్లమెంట్‌లో మరింత విస్తృత చర్చకు అవకాశం ఏర్పడింది.

## ఆయిల్‌పామ్ తోటల్లో ప్రయోగాత్మకంగా వీవిల్ విడుదల

- ఆయిల్ ఫామ్ తోటల్లో వీవిల్ ద్వారా అధిక దిగుబడులు*
- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్.



**మెదక్ ఆగష్టు,11(సిరి న్యూస్)**

ఆయిల్ ఫామ్ తోటలతో అధిక లాభాలు అర్జించవచ్చని జిల్లా ఉద్యానవనాధికారి ప్రతాప్ సింగ్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలోని ప్రభు వరగౌడ్ ఆయిల్‌పామ్ తోటల్లో పరాగ సంపర్కం కోసం ఉద్యాన శాఖ అధికారులచే "ఎలిడోబియస్ కెమెరోనికస్" వీవిల్ ను విడుదల చేశారు.దీని వలన ఫలదీకరణ జరిగి గెలల ఏర్పాటు మెరుగుపడి దిగుబడి పెరుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించి వీవిల్ వదలడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఘనపూర్ వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి, ఉద్యాన అధికారి రచన, లీవ్ పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణ, కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి తేజస్విని మరియు రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేస్తూనే సంఘం బలోపేతానికి పనిచేస్తా

### పటాన్ చెరు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా పత్తి నర్సింహా

**రామచంద్రాపురం, ఆగస్టు 11 (సిరి న్యూస్):**



జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూనే టీయూడబ్ల్యూజే–ఐజేయూ సంఘం బలోపేతానికి శాయశక్తులా పనిచేస్తానని నూతన పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నర్సింహా అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ వారి హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే–ఐజేయూ అధ్యక్షుడిగా పత్తి నర్సింహాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## రామాయంపేట శివారులో రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి




**రామాయంపేట, ఆగస్టు 11 (సిరి న్యూస్ )**

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రామాయంపేట శివారులోని ఆధ్యా హోటల్ సమీపంలో NH–44పై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన జూపల్లి వెంకట్రావు (49) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం రాత్రి బాచుపల్లి, హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన మల్కాపూర్‌కు స్కూటీ (TS08GR3647)పై బయలుదేరారు. రాత్రి సుమారు 2:30 గంటల సమయంలో రామాయంపేట శివారులోని ఆధ్యా హోటల్ సమీపంలో NH–44పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వెంకట్రావు స్కూటీని ఢీకొట్టి అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో వెంకట్రావు స్కూటీపై నుంచి కిందపడటంతో చేతులు, కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన వెంకట్రావును అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు జూపల్లి రిషి వేదుకు పోలీసులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన అడిట్

### డివిజన్ పరిధిలో మొత్తం 169 స్కూళ్ల ఆడిట్ ఒక్కరోజే

**పటాన్ చెరు, ఆగస్టు 11, (సిరి న్యూస్):**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు మండలాలు పటాన్ చెరు, రామ చంద్ర పురం, అమీన్ పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల కు సర్వ శిక్ష అభియాన్, ఇతర పథకాల ద్వారా విడుదలైన నిధుల వినియోగానికి సంబంధించిన ఆడిట్ మంగళ వారం నాడు పూర్తి అయింది. పటాన్ చెరు మండలంలో 42 స్కూళ్లు రామ చంద్ర పురం లో 32, అమీన్ పూర్ లో 21, జిన్నారం లో 38, గుమ్మడిదల లో 36 పాఠశాలల కి సంబంధించిన విద్యా శాఖ సంబంధమైన ఆర్థిక లావాదేవీల రికార్డుల పరిశీలన మంగళ వారం నాడు పటాన్ చెరు పట్టణంలోని పి వీ నరసింహ రావు ఆడిటోరియం లో స్థానిక మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్ పర్యవేక్షణ లో నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మండలాల వారీగా అడిట్ వ్యవహారాలను తనిఖీ చేశారు. దివిజన్ లోని 5 మండలాల పరిధిలోని ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్ మాస్టర్ లు ఈ సందర్భంగా వారి వారి గత ఆర్థిక సంవత్సరం కి సంబంధించిన క్యాష్ బుక్



ఇతర యూసీ లు తీసుకుని వచ్చి అడిట్ చేయించుకున్నారు. అడిట్ సభ్యులు అన్ని రికార్డులను పరిశీలించి సంబంధిత స్కూల్ హెడ్ మాస్టర్ కి అడిట్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్య క్రమంలో మండల వనరుల కేంద్రం సిబ్బంది విక్టర్, ఉమారాణి, సాయి, ప్రశాంతి అడిట్ సిబ్బందికి సహకారం అందించారు.

# పరిశోధన ప్రచురణ నైతికతపై గీతం ప్రొఫెసర్ మార్గదర్శనం

**పటాన్ చెరు, ఆగస్టు 11, (సిరి న్యూస్):**

హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సీఎస్ఈ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ కొల్హాపూర్ (మహారాష్ట్ర)లోని డి వై పాటిల్ వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం పరిశోధన ప్రచురణ నైతికత అనే అంశం నిర్వహించిన ఒకరోజు అధ్యాపక వికాస కార్యక్రమం (ఎఫ్.డీ.పీ)లో ముఖ్య వక్తగా పాల్గొని, ఉపన్యసించారు. న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్టీఈ) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె సదస్యుల కు మార్గదర్శనం చేసినట్టు



మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. నైతిక పరిశోధన, విద్వత్ ప్రచురణల ప్రాముఖ్యతపై డాక్టర్ పర్వేకర్ దృష్టి సారించినట్టు తెలిపారు. పరిశోధన సమగ్రత, ప్రచురణ నైతికత, సాహిత్య చోరీ నివారణ, పీర్ రివ్యూ, బాధ్యతాయుతమైన పరిశోధన ప్రవర్తన, నాణ్యమైన పరిశోధనను ప్రచురించడానికి ఉత్తమ పద్ధతులు వంటి కీలక అంశాలను ఆమె ప్రముఖంగా ప్రస్తావించినట్టు పేర్కొన్నారు. అధ్యాపక సభ్యులు, పరిశోధనా పండితులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, విద్యా పరిశోధనలో ఉన్నత నైతిక ప్రమాణాలను పాటించడంపై వారు వక్తతో చురుకుగా సంభాషించినట్టు తెలిపారు. ఈ ముఖాముఖి కార్యక్రమం, శాస్త్రీయ ప్రచురణల లో సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం ప్రాముఖ్యతను నొక్కి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు సంగ్రామ్ పాటిల్, నిర్వాహక కమిటీతో పాటు అందులో పాల్గొన్న వారందరికీ డాక్టర్ పర్వేకర్ ధన్యవాదాలు తెలియజేసిందన్నారు. ఇటువంటి ఎఫ్.డీ.పీ.లు నైతిక పరిశోధన పద్ధతులను బలోపేతం చేస్తాయని, జ్ఞాన వినిమయాన్ని ప్రోత్సహిస్తాయని, సహకార అభ్యాసం ద్వారా విద్యా నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని ఆమె అభిప్రాయపడినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి కరెంటు కష్టాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సీరియస్

- విద్యుత్ సమస్యపై అధికారుల తీరుపై ఆగ్రహం
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే.
- తక్షణమే 4 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి..
- నిధులు విడుదలైన వెంటనే వైరింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశం..
- త్వరలో ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం

**పటాన్ చెరు, ఆగస్టు 11, (సిరి న్యూస్):**

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యుత్ సమస్యలు తలెత్తి రోగులు ఇబ్బందులు పడుతున్న ఘటనపై పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్, వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సభ్యులతో ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు జనరేటర్ పనిచేయకపోవడం వల్ల రోగులు, వారి సహాయకులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన అధికారులను ఆరా తీశారు. ఆసుపత్రిలో విద్యుత్ సమస్య తలెత్తినా, జనరేటర్ పనిచేయక పోయినా ఈ విషయం నా దృష్టికి ఎందుకు తీసుకు రాలేదు?" అంటూ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించే సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటం, ప్రత్యామ్నాయంగా ఉండాల్సిన జనరేటర్ కూడా పనిచేయకపోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రి మొత్తం విద్యుత్ వైరింగ్‌ను మార్చేందుకు సుమారు రూ.4 లక్షలు అవసరమవుతాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. జిల్లా



కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఫోన్ చేసి ఆసుపత్రి వైరింగ్ పనుల కోసం అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభించి, ఆసుపత్రిలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఇకపై ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కరోనా మహమ్మారి సమయంలో సీఎస్ఆర్ నిధులతో ఆసుపత్రికి జనరేటర్ ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. అత్యవసర సమయాల్లో రోగులకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు జనరేటర్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. అదే విధంగా పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన పనులు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించేందుకు త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం, నాణ్యమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రధాన ఎజెండా

- జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి-
- పటాన్ చెరులో టీయూడబ్ల్యూజే–ఐజేయూ సర్వసభ్య సమావేశం
- ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**పటాన్ చెరు, ఆగస్టు 11 (సిరి న్యూస్):**

జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం రామచంద్రాపూర్ లోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, యూనియన్ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ ప్రధాన ఎజెండా అని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు భాగస్వామి కావాలని, జర్నలిస్టుల సమస్యలపై



సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యల మధ్య విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఆరోగ్య కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా అక్రిడిటేషన్ కార్డులు అందని జర్నలిస్టులు ఉన్నారని, వారందరికీ నిబంధనల మేరకు కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు సహా అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యలను సమానంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యూనియన్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం విషయంలో సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ.కే. పైసల్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో , జిల్లా కమిటీ నాయకులు, కార్యవర్గ సభ్యులు మాట్లాడి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొని జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమంపై తమ సూచనలు చేశారు.

# ఆసరా పెన్షన్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- చేయూత పింఛన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ.
- అధికారిక చేయూత పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులు సమర్పణ చివరి తేదీ ఆగష్టు 31వరకు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ ఆగష్టు,11(సిరి న్యూస్)**

చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని తెలిపారు. ఈ ప్రక్రియకు చివరి తేదీ 31.08.2026, అర్హులైన నిరుపేదల నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని కలెక్టర్ వివరించారు. దరఖాస్తు చేయాల్సిన విధానం గురించి వివరిస్తూ అధికారిక వెబ్‌సైట్ చేయూత పోర్టల్ నుండి కానీ,గ్రామ పంచాయతీ/మున్సిపల్ కాయలయం నుండి కానీ దరఖాస్తు ఫారమ్‌ను పొందవచ్చన్నారు.గ్రామీణ ప్రాంతాల వారు పూరించిన దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేదా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని, పట్టణ ప్రాంతాల వారు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు లేదా మున్సిపల్ కమిషనర్లకు సమర్పించాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు ఆ దరఖాస్తులు గ్రామ పంచాయితీ కార్యదర్శి వద్దగాని,యంపీడిఓ కార్యాలయంలో గాని,మున్సిపల్ కార్యాలయంలో గాని ఉన్నాయా,ఆ దరకాస్తు తో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు జత పరిచారా అని దరకాస్తు దారులు సరిచుసుకోవాలన్నారు.

**ఎవరెవరు దరఖాస్తు చేసుకోవాలి**

ప్రాధాన్య కేటగిరీలు అర్హతలు గురించి వివరిస్తూ ఒంటరి మహిళలు, వితంతువులు,దివ్యాంగులు,గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు, థలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు. అర్హులన్నారు.

**ఆదాయపరిమితి**

గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. అవసరమైన ధృవీకరణ పత్రాల జారీకి సౌకర్యం కల్పించడం: పింఛన్ల మంజూరుకు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు పత్రాలు, వర్తించే విధంగా, సంబంధిత శాఖలు అధికారుల ద్వారా సమకూర్చి



జారీ చేయబడేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వితంతువుల విషయంలో భర్త మరణ ధృవీకరణ పత్రం, ఒంటరి మహిళల విషయంలో వేర్పాటు తసీల్దార్ స్థానిక విచారణ నివేదిక,దివ్యాంగులకు UDID ధ్రువీకరణ పత్రం, కల్లు గీత కార్మికుల విషయంలో నిషేధ & ఎక్సైజ్ శాఖ నుండి ధృవీకరణ పత్రం, నేత కార్మికుల విషయంలో చేనేత & వస్త్ర పరిశ్రమ శాఖ నుండి ధృవీకరణ పత్రం, మరియు ఫైలేరియా రోగుల విషయంలో వైద్య & ఆరోగ్య శాఖ నుండి ఫైలేరియాసిస్ ధృవీకరణ పత్రం. తప్పనిసరి అన్నారు. స్వయం సహాయక బృందాల సమాఖ్యల పాత్ర గురించి వివరిస్తూ స్వయం సహాయక బృందాల సమాఖ్యలకు విస్తృతమైన పరిధి ఉన్నందున, చెయూత పింఛను కోసం దరఖాస్తు చేసుకోవడానికి మరియు అవసరమైన ధృవపత్రాలను పొందడానికి అర్హులైన ప్రతి వితంతువుకు మరియు ఒంటరి మహిళకు సహాయం అందించే బాధ్యతను వారికి అప్పగించారని చెప్పారు..ఆన్‌లైన్ డేటా ఎంట్రీ స్క్రీన్‌లను అభివృద్ధి చేసి, అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు ప్రతి మండలానికి 3 చొప్పున, ప్రతి పురపాలక సంఘానికి 5 చొప్పున మరియు ప్రతి పురపాలక సంఘానికి 10 చొప్పున డేటా ఎంట్రీ లాగిన్ ఐడీలను సృష్టించడం జరిగిందని,డేటా ఎంట్రీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అసంపూర్ణమైన / తప్పు డేటాను నమోదు చేయకూడదు. అని వివరించారు.అనర్హుల గురించి వివరిస్తూ మూడు ఎకరాలకు (మించి)మాగాణి లేదా 7.5 ఎకరాలకు (మించి) మెట్ట భూమి ఉన్నవారు, నాలుగు చక్రాల వాహనాలు కలిగినవారు మరియు ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగులు అనర్హులు. అని చెప్పారు. వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హేమోఫోలియా, బోదకాలు, డయాలసిస్, చేనేత కార్మికులు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, యు డి ఐ డి / సదరం ధ్రువీకరణ పత్రం జత చేయాలని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. భవిష్యత్తుకు బాటగా

- యువతకు జిల్లా ఎస్పీ పిలుపు.
- ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన మెదక్ ప్రెస్‌క్లబ్.
- సైబర్ మోసాలపై అవగాహనే ఆయుధం.
- ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలకు అడ్డుకట్ట.
- మహిళలు,బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు.
- మెదక్ జిల్లా ఎస్పీ.డి. వి.శ్రీనివాస రావు.

**మెదక్ ఆగష్టు,11(సిరి న్యూస్)**




జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికల భద్రతకు పోలీసుశాఖ ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ లతో పాటు మీడియా ప్రతినిధులు మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.నూతన కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణలో ప్రజలతో పాటు మీడియా సహకారం కీలకమన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. మహిళలు, బాలికల భద్రత కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనకు చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా తరపున పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కోశాధికారి చెవిటి అశోక్, గౌరవ కార్యవర్గ సభ్యులు కామాటి కృష్ణ, నీలం, శ్రీధర్, సందీప్, రమేష్, సిద్ధు, రాజాగౌడ్, రహమత్, ఫణిరాజ్, శ్రీహరిగౌడ్, కార్తీక్, సుబ్బు, మల్లేశం, ఫని, మల్లికార్జున్, లక్ష్మణ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో మువ్వన్నెల సందడి..

- దేశభక్తిని చాటిన త్రివర్ణ ర్యాలీ
- 800 మంది విద్యార్థులతో 200 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన..
- పట్టణ ప్రధాన వీధుల్లో మారుమోగిన దేశభక్తి నినాదాలు

**రామాయంపేట, ఆగస్టు 11 (సిరి న్యూస్)**





స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా రామాయంపేట పట్టణం మువ్వన్నెల వెలుగులతో శోభిల్లింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన “ప్రతి ఇంటిపై జాతీయ జెండా” సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామాయంపేట పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా త్రివర్ణ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రామాయంపేట పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీ అత్యంత కోలాహలంగా సాగింది. సుమారు 800 మంది పాఠశాల విద్యార్థులు 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాను చేతబట్టి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీగా కదిలారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పట్టణ వీధులన్నీ మారుమోగాయి. ర్యాలీని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్ల వెంట నిలబడి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను నేటి యువత గుర్తుంచుకోవాలని అన్నారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని నింపే పవిత్ర ప్రతీక అని పేర్కొన్నారు. ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ ఐక్యతను, సమగ్రతను చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ, జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి భారతీయుడు “నా దేశం.. నా ధర్మం” అనే భావనతో దేశాన్ని ప్రేమించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న సంకల్పంలో భాగంగానే ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాగి రాములు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో మరింత బలపరచాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో దేశభక్తి భావనను పెంపొందించి, దేశం పట్ల బాధ్యత, జాతీయత, క్రమశిక్షణ వంటి విలువలను పెంచడమే ఈ త్రివర్ణ ర్యాలీ ఉద్దేశమని మాజీ జెడ్పిటిసి, నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర సీనియర్ నాయకుడు పంజ విజయ్ కుమార్ పేర్కొన్నారు.“మన గౌరవంగా మనం జీవించాలంటే ముందుగా మన దేశాన్ని గౌరవించాలి. జాతీయ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతిరూపం. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలన్నదే ప్రధాని మోదీ సంకల్పం” అని నిజాంపేట మండల మాజీ జెడ్పిటిసి, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు పంజ విజయ్ కుమార్ అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంజిత్ మోహన్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ మస్కూరి బాలరాజు, అలాగే పార్టీ నాయకులు ప్రవీణ్ రాజు, అక్కల అనిల్, దిలీప్, నాగరాజు, వెంకటేష్, శంకర్ గౌడ్, కాశీనాథ్, సిద్ధారములు, శేఖర్, రమేష్, మల్లిక, విజయ్, సత్యనారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు భారీ జాతీయ జెండాను చేతబట్టి క్రమశిక్షణతో నిర్వహించిన ఈ ర్యాలీ రామాయంపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యతను చాటుతూ సాగిన ఈ త్రివర్ణ ర్యాలీ పట్టణ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపింది.

## మహంకాళి మాత ఆలయంలో హుండీ లెక్కింపు

### సంవత్సర ఆదాయం 1.05781 రూపాయలు.



**రామాయంపేట, ఆగస్టు 11 (సిరి న్యూస్)**

రామాయంపేట మండల కేంద్రంలోని శ్రీ మహంకాళి మాత దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ సంవత్సరం 1.05781 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రవికుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం బోనాల జాతర అనంతరం హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో హుండీలను తెరిచి లెక్కింపు చేపట్టారు. బోనాల ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న నేపథ్యంలో హుండీ ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. Fostering ప్రక్రియను దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఫ్టీ చైర్మన్ సరాపు పాండు రంగాచారి. సభ్యుడు సరాపు శ్రీనివాస చారి, గ్రేడ్ 3 ఈవో వి.శ్రీనివాస్, ఆలయ అర్చకులు జె.నాగరాజ చారి, దేవాలయ కమిటీ మాజీ డైరెక్టర్ దోమకొండ యాదగిరి, కానిస్టేబుల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం

### 2లక్షల ఆర్థిక సహాయం... మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**పాపన్నపేట ఆగస్టు 11 సిరి న్యూస్ :**

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ సిబ్బంది కృష్ణ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. మంగళవారం కృష్ణ స్వగ్రామానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ.. కృష్ణ మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని, చిన్న వయసులోనే కుటుంబానికి దూరం కావడం బాధాకరమన్నారు. కృష్ణ కుటుంబం ఒంటరిది కాదని, కష్టకాలంలో వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగంకల్పిస్తానని. ఎలాంటి అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే, సహాయం చేసేందుకు ముందుంటానని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులుమాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, భాస్కర్ లకు ధైర్యం కోల్పోకుండా మనోధైర్యంతో ఉండాలని సూచించారు. అనంతరం కుర్తివాడ మాజీ సర్పంచ్ బుర్ర రామ గౌడ్ ద్విచక్ర వాహనంపై నుండి కిందపడి వెన్నుముక పై బలమైన గాయాలు కావడం తో నడవలేని పరిస్థితి నెలకొందని తెలుసుకున్న అయన రామగౌడ్ సహోదరి ఇంటివద్ద ఉంటున్నారని తెలుసుకుని రామగౌడ్ ను పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అయన వెంట స్థానికసర్పంచ్ పావని నరేందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప. నాయకులుప్రశాంత్ రెడ్డి, సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్, శేఖర్,శ్రీశైలం అప్ప,యాదగిరి ,నిట్ట లాక్షప్ప, బాపురెడ్డి,కిష్టయ్య, సత్యనారాయణ, ఖలీం, అబెద్, సంతోష్ రెడ్డి,సంగమేష్, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## సొంత నిధులతో కానుకుంట రహదారికి తాత్కాలిక మరమ్మతులు

### ప్రయాణికుల ఇబ్బందులపై మున్సిపల్ పాలకవర్గం చొరవ



**గుమ్మడిదల ఆగస్టు 11 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రం నుంచి కానుకుంట వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాల ముప్పు పొంచి ఉండటంతో స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వార్డు కౌన్సిలర్లు మంగళవారం రహదారిని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గం సొంత నిధులతో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి శాశ్వత నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరలోనే తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రజాప్రతినిధుల చొరవతో రహదారిపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు, ప్రయాణికులు కొంత ఊరట కలుగుతుంది . ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మూడుచింతల నరేందర్ రెడ్డి, కత్తుల రమేష్, నాయకులు వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు గుండెల్లో వివేక్ చెరగని ముద్ర!..





- చెన్నూరు మొత్తం మంత్రి చుట్టూనే రాజకీయం..
- అభివృద్ధి పనుల వేగానికి జనం ఫిదా..
- విషప్రచారాలు చేసినా చెక్కుచెదరని ఆదరణ..
- ఎన్నికల నగారా మోగితే... మరోసారి చెన్నూరు కాంగ్రెస్ దే!

**మంచిర్యాల, జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ ఆగస్టు 11 ( సిరి న్యూస్ )**

చెన్నూరు రాజకీయాల్లో ప్రస్తుతం ఒకటే హాట్ టాపిక్..అదే రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పెరుగుతున్న క్రేజ్. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్న వేళ, నియోజకవర్గంలో మంత్రి పనితీరుపై చర్చ ఊపందుకుంది. ప్రత్యర్థులు ఎన్ని ఎత్తులు వేసినా, ఎన్ని అవాంతరాలు సృష్టించినా వాటన్నింటినీ దాటుకుంటూ మంత్రి వివేక్ ప్రజల మనసుల్లో స్థానం సంపాదిస్తున్నారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. వారానికి మూడు, నాలుగు రోజులు నియోజకవర్గంలోనే మకాం వేసి, ప్రజల కష్టసుఖాలు స్వయంగా తెలుసుకుంటూ అభివృద్ధి పనులను కళ్లారా పర్యవేక్షించడం మంత్రికి పెద్ద ఎత్తున కలిసొస్తోంది..

**కోట్లతో అభివృద్ధి పరుగులు..**

కోటపల్లి మండలం సోమనపల్లి వద్ద రూ.200 కోట్లతో సమీకృత పాఠశాల నిర్మాణం చేపడుతూ, చెన్నూరు, మందమర్రి, క్యాతన్పల్లి పురపాలికల్లో వందల కోట్ల రూపాయల విలువైన పనులను వేగవంతం చేస్తూ మంత్రి వివేక్ తన ముద్ర చాటుకుంటున్నారని అనుచరులు చెబుతున్నారు. అమృత్ పథకం కింద మందమర్రి, క్యాతన్పల్లిలో రూ.40 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు.

**సామాజిక మాధ్యమాల్లో కుట్రపూరిత ప్రచారం!..**

మంత్రి వివేక్ ప్రజాదరణను దెబ్బతీసేందుకు కొన్ని రాజకీయ వర్గాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తప్పుడు ప్రచారానికి తెరతీశాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సొంత పార్టీలోని కొందరు నేతలే ఈ కుట్రలో భాగస్వాములుగా ఉన్నారన్న సంచలన చర్చ కూడా జరుగుతోంది. అయినా మంత్రి మాత్రం వీటిని ఏమాత్రం పట్టించుకోకుండా తన పనిలో తాను నిమగ్నమయ్యారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**జిల్లాకి మంత్రి... ప్రజల గుండెల్లో దగ్గరైన నేత..**

చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలతో మమేకమవడం, కష్టాల్లో ఉన్నవారిని స్వయంగా పరామర్శించడం, మృతుల కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం మంత్రి వివేక్కు అదనపు బలంగా మారిందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఇదే ఆయనను ప్రజలకు మరింత చేరువ చేస్తోందని విశ్లేషిస్తున్నారు.

**భూదందాలు, ఇసుక మాఫియాపై నేరుగా వార్!..**

నియోజకవర్గంలో భూదందాలు, అక్రమ ఇసుక రవాణా, అవినీతిపై మంత్రి వివేక్ ఉక్కుపాదం మోపుతున్నారని సమాచారం. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే ససేమిరా సహించబోమని స్పష్టం చేస్తున్నారని, పార్టీలో క్రమశిక్షణకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే నాయకులకు మింగుడుపడటం లేదన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.



**అధికారులపైనా కన్నెర్ర..**

అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు నిర్వహిస్తూ, జవాబుదారీతనంతో పనిచేయాలని అధికారులను మంత్రి ఆదేశిస్తున్నారు.

అయితే మంత్రి సౌమ్య స్వభావాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో మంత్రి మరింత కఠినంగా వ్యవహరిస్తే ప్రజాదరణ ఇంకా పెరిగే అవకాశం ఉందని పరిశీలకుల విశ్లేషణ.

**ఎన్నికల నగారా మోగితే... చెన్నూరు కాంగ్రెస్ దే!..**

ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తే రాబోయే ఎన్నికల్లో చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. అభివృద్ధి, ప్రజా సంక్షేమం, అందుబాటులో ఉండే నాయకత్వాన్ని ఆయుధాలుగా చేసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి,

వ్యక్తిగత సమస్యల పరిష్కారం, అధికారులపై పర్యవేక్షణ, పార్టీలో అంతర్గత విభేదాలకు చెక్ పెట్టడంపై మరింత దృష్టి సారిస్తే చెన్నూరు రాజకీయాల్లో తన పట్టును పూర్తిగా సుస్థిరం చేసుకుంటారన్న చర్చ నియోజకవర్గం అంతటా హోరెత్తుతోంది.

## మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా శేఖర్ గౌడ్



**వెల్దుర్తి, ఆగస్టు 11, (సిరి న్యూస్):**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కమిటీని బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్ ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు కోదండ శేఖర్ గౌడ్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని పార్టీ ఇచ్చిన సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ పార్టీకి చేసిన సేవలు, హిందుత్వ భావజాలాలు కలిగిన వ్యక్తిగా మండల వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారు అలాగే గతంలో వెల్దుర్తి మండల బిజెపి మండల అధ్యక్ష పదవి సమర్థవంతంగా నిర్వహించిన తీరును పరిగణలోకి తీసుకొని మెదక్ జిల్లా బిజెపి జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్ మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శేఖర్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ నాపై నమ్మకంతో మరింత బాధ్యత పెట్టింది పార్టీ నమ్మకాన్ని కాపాడుతూ పార్టీ ఎదుగుదలకు నా శాయశక్తుల కృషి చేస్తాను నాపై పెట్టిన బాధ్యతకు తగిన న్యాయం చేకూరుస్తానని తెలిపారు అలాగే ఈ అవకాశం కల్పించడానికి సహకరించిన ఎంపీ రఘునందన్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్, మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కందునూరి. శ్రీనివాస్ గౌడ్, అశోక్ సాదుల, మల్లారెడ్డి, కిచ్చుగారి శ్రీనివాస్, గజం చందు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుక..సేవా సందడి..

- గడ్డం వినోద్ వివాహ వేడుక.. కార్యకర్తలు సేవా బాట!..
- రోగులకు పండ్ల పంపిణీ..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (సిరి న్యూస్)**

ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి, గడ్డం రమాదేవి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ కాంగ్రెస్ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక సందర్భాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 19వ వార్డు బెల్లంపల్లి బస్తీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాంపెల్లి శ్రీనివాస్ ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి పండ్లు అందజేశారు. వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు..

## మంచిర్యాల కార్పొరేషన్లో ఎమ్మార్పీఎస్ కమిటీల నిర్మాణం..

- మాదిగ ఉద్యమానికి కొత్త కమిటీ..
- 30వ డివిజన్కు నూతన కమిటీ ఎన్నిక..
- ఉద్యమాలకు మాదిగలను సన్నద్ధం చేసే దిశగా అడుగులు..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (సిరి న్యూస్)**

ఎమ్మార్పీఎస్ భవిష్యత్ ఉద్యమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మాదిగలను ఉద్యమాలకు సన్నద్ధం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో కమిటీల నిర్మాణం కొనసాగుతోంది. ఈ క్రమంలో నస్పూర్ మండల ఇన్చార్జిలు గద్దల బానయ్య, బచ్చల రమేష్, సహ ఇన్చార్జిలు గుంపుల స్వామి, కొయ్యల శేఖర్ ఆధ్వర్యంలో మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని విలేజ్ శ్రీరాంపూర్ 30వ డివిజన్కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రసపెల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా శనిగరపు రాజలింగు, ప్రధాన కార్యదర్శిగా చిప్పకుర్తి విష్ణు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లింగంపల్లి బీమయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే ఉద్యమాలను విజయవంతం చేసేందుకు మాదిగలను ఐక్యంగా సన్నద్ధం చేయడమే లక్ష్యంగా కమిటీల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో పార్టీ, సంఘటనా బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంథని మల్లేష్, నక్క అంజన్న, సిరికొండ బోస్ పాల్గొన్నారు.

# ఫుట్పాత్పై పిచ్చి మొక్కల తొలగింపు

- వ్యాపారుల హర్షం
- కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు

**గుమ్మడిదల, ఆగస్టు 11 (సిరి న్యూస్):**




మరమ్మత్తుల పేరుతో రోడ్డును తొలగించి గాలికొదిలేశారు అనే శీర్షికతో సిరి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ శాఖ అధికారులు స్పందించారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి 765డీ పక్కన ఫుట్పాత్పై పెరిగిన పిచ్చి మొక్కలను మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కొంతకాలంగా ఫుట్పాత్పై పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో పరిసర ప్రాంతాల్లో దోమలు, క్రిమికీటకాల బెడద పెరిగిందని స్థానిక వ్యాపారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సిరి దినపత్రిక కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. మంగళవారం సిబ్బందిని రంగంలోకి దించి ఫుట్పాత్పై పెరిగిన పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. దీంతో దోమలు, క్రిమికీటకాల బెడద నుంచి ఉపశమనం లభించిందని స్థానిక వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించి వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సిరి దినపత్రికకు స్థానికులు, వ్యాపారులు అభినందనలు తెలిపారు.




# భారతి నగర్ డివిజన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

- జోనల్ కమిషనర్ను కలిసిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 11 (సిరి న్యూస్)**

భారతి నగర్ డివిజన్లో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ను కలిసి వినతిపత్రం అందజేశారు. బొంబాయి కాలనీ కమ్యూనిటీ హాల్ అద్దెను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.8 వేలకు నిర్ణయించాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, రూ.8 వేల అద్దె నిర్ణయాన్ని ఆమోదిస్తూ తదుపరి చర్యల కోసం డిప్యూటీ కమిషనర్ ప్రదీప్కు పంపించారు. తన కార్పొరేటర్ పదవీకాలంలో మంజూరైన ఎల్ఐజీ కాలనీ హౌస్ నంబర్ 511 సమీపంలోని షెడ్, ఫెన్సింగ్ ఏరియా షెడ్, ఎంఏసీ సొసైటీ కమ్యూనిటీ హాల్ షెడ్ నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సింధు ఆదర్శ్ రెడ్డి కోరారు. ఎంఎంటీఎస్ నుంచి అన్నమయ్య ఎన్క్లేవ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఓల్డ్ ఎంఐజీలో కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని, బొంబాయి కాలనీలో నిర్మించిన మోడల్ రైతు బజార్ను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించిన జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆషాఢం బోనాల ఉత్సవాలు

- **ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.**





**రామాయంపేట,ఆగష్టు 11 (సిరి న్యూస్ )**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు బీసీ కాలనీలో ఆషాఢం బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం చివరి రోజు బోనాల ఉత్సవాల్లో భాగంగా ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఫలహారం బండిని ప్రారంభించి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికీ సుభిక్షం కలగాలని ఎల్లమ్మ అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఫలహారం బండి ఊరేగింపులో మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణతో సందడి చేశారు. డప్పు చప్పుళ్లు, భక్తుల కోలాహలంతో బీసీ కాలనీ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పిఏ సిఎస్ చైర్మన్ బాదే చంద్రం, మున్సిపల్ రెండో వార్డ్ కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వర్, మద్దెల రమేష్, హష్మొద్దిన్, కన్నాపురం కృష్ణ గౌడ్, దోమకొండ శ్రీనివాస్, గుడాల లింగం, దత్తు సాగర్, పోచమ్మల ఐలయ్య, దాకి శ్రీనివాస్, రొయ్యల నవీన్, రామ్ కి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లపై కాంగ్రెస్ మోసం.. బీజేపీ ఫైర్!..

- **అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాల్సిందే: బీజేపీ నేతల డిమాండ్..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(సిరి న్యూస్)**

తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఆ హామీని అమలు చేయడం లేదని బీజేపీ నాయకులు మండిపడ్డారు. రూ.2 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు, రూ.3 వేల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోగా, గతంలో మంజూరైన అనేక పెన్షన్లను తొలగించారని విమర్శించారు. ఇప్పటివరకు ఎన్ని పెన్షన్లు తొలగించారో ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్లు ఇస్తామని మరోసారి ప్రజల్లో ఆశలు కల్పిస్తున్న ప్రభుత్వం, ఎంతమందికి మంజూరు చేస్తుందో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతం వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడం సరికాదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. వృద్ధులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ రోగులు తదితర అర్హుల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ మున్సిపల్ పక్ష నేత ముకేశ్ గౌడ్, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, బోట్ల అనిత సత్యం మాట్లాడుతూ,ఎన్నికల హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, రాజకీయ వివక్ష లేకుండా వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయకపోతే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం-సేటు ఐటిఐ క్లస్టర్ ఏర్పాటు చేయాలి

- **కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామికి మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ బ్యూరో, ఆగష్టు 11**

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పీఎం–సేటు ఐటిఐ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రిని కలిసి పెద్దపల్లి ప్రాంతానికి పీఎం–సేటు ఐటిఐ క్లస్టర్ అవసరాన్ని వివరించారు. తెలంగాణ రాష్ట్రం పీఎం–సేటు కార్యక్రమంలో అగ్రగామిగా ఉన్న నేపథ్యంలో, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఒక పీఎం–సేటు ఐటిఐ క్లస్టర్‌ను ఎన్ఎండిసి ద్వారా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామిక, మైనింగ్ బెల్ట్‌గా ఉన్నందున ఈ ప్రాంత యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కేంద్ర మంత్రికి వివరించారు. ప్రత్యేకంగా మైనింగ్, మెటల్స్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ రంగాలకు అనుగుణంగా ఐటిఐ శిక్షణ కోర్సులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనివల్ల స్థానిక యువతకు పరిశ్రమలపై ప్రత్యక్ష అవగాహనతో పాటు ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, అప్రెంటిస్‌షిప్, ఆన్‌ది–జాబ్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ వంటి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ఒక ప్రభుత్వ ఐటిఐని పీఎం–సేటు హబ్‌గా, ఇతర ఐటిఐలను స్పోక్‌లుగా గుర్తించి క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విధానం ద్వారా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నైపుణ్యంతో కూడిన వర్క్‌ఫోర్స్‌ను తయారు చేయడంతో పాటు స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని వివరించారు. పీఎం–సేటు ఐటిఐ క్లస్టర్ ఏర్పాటుకు ఎన్ఎండీసీతో పాటు సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి కుమారస్వామిని మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. వారి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పెద్దపల్లి ప్రాంత యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, అప్రెంటిస్‌షిప్, ఉపాధి అవకాశాలు పెంచేందుకు పీఎం–సేటు ఐటిఐ క్లస్టర్ కీలకంగా నిలుస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక బోనాల ఉత్సవాలు

- **ప్రముఖ కవులు, కళాకారులు, జర్నలిస్టులు, ఉద్యమకారులు హాజరు**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 11,**

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, కవులు, కళాకారులు, వక్తలు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, టూరిజం సాంస్కృతిక శాఖ సలహాదారు దరువు అంజన్న, తెలంగాణ కలాల గళాల వేదిక ఆధ్వర్యంలో మహాదేవపురం డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో ఉన్న పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో "కుత్బుల్లాపూర్ కళాకారుల బోనాల జాతర" వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులు, జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కవులు, కళాకారులు, జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ అంటే కేవలం భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, తెలంగాణ అంటే ఒక జీవన సంస్కృతి, ఆటపాటల పుట్ట అని అన్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన తెలంగాణ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న గొప్ప వారసులు జానపద కళాకారులని పేర్కొన్నారు. పుస్తకాల్లో లేని చరిత్రను పాటల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ వారిలో చైతన్యం తీసుకువచ్చేవారే ప్రజా కళాకారులని అన్నారు. సామాన్యుల జీవితాలు, రైతుల కష్టాలు, కూలీల సమస్యలు, మహిళల భావాలు, పల్లె జీవనాన్ని తమ కళ ద్వారా ప్రతిబింబించిన ఘనత కళాకారులకే దక్కుతుందని తెలిపారు. కళాకారుల చేతిలోని డప్పు కేవలం ఒక వాయిద్యం కాదని, అది గుండె చప్పుడు అని పేర్కొన్నారు. వారి గొంతులో వినిపించే పాట కేవలం వినోదం కోసం కాదని, సమాజానికి గొప్ప సందేశాన్ని అందించే సాధనమని అన్నారు. కళాకారులను చరిత్రకారులుగా, సామాజిక కార్యకర్తలుగా, చైతన్యవంతులుగా, ప్రజల గొంతుకగా చూడాలని సూచించారు. "కళ బతికితేనే సంస్కృతి బతుకుతుంది.. సంస్కృతి బతికితేనే సమాజం బతుకుతుంది.. సమాజం బతికితేనే మన అస్తిత్వం బతుకుతుంది" అని విరాహత్ అలీ పేర్కొన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు, జగద్గిరిగుట్ట జేఏసీ అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, ఉద్యమకారులు, జేఏసీలుగా ఏర్పడి ఉద్యమాల్లో పాల్గొని అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. వారి పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని అన్నారు. అనంతరం టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్, తెలంగాణ గద్దర్ నర్సన్న, బిజెపి రాష్ట్ర సెల్ కో కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, కాంగ్రెస్ పార్టీ మహాదేవపురం అధ్యక్షులు సిద్ధినోళ్ల సంజీవరెడ్డి తదితరులు మాట్లాడారు.

**డప్పు చప్పుళ్లు.. పోతరాజుల నృత్యాలతో సందడి**

బోనాల జాతర వేడుకల్లో సుమారు 200 మంది కళాకారులు, చైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, బోనాల పాటలు, పోతరాజుల నృత్యాలతో కార్యక్రమ ప్రాంగణం హోరెత్తింది. కళాకారుల ఆటపాటలు, జానపద ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మాచారి, పుష్పారెడ్డి, పోలీస్ జీవేందర్ రెడ్డి, మన్నె రాజు, పుప్పాల భాస్కర్, విట్టల్, గంధం రాములు, మహేష్ గౌడ్, గాయకులు అంతడుపుల నాగరాజు, పాండు ముదిరాజ్, శివ, రవీందర్, కావలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ కి వెళ్తున్నా అని చెప్పి బాలుడి మిస్సింగ్

## తల్లి పిర్యాదు తో కేసు నమోదు చేసిన పోలీసులు

**పటాన్ చెరు ఆగస్టు 11, (సిరి న్యూస్):**



స్కూల్ కి వెళ్ళిన బాలుడి తిరిగి ఇంటికి రాక పోవడంతో తల్లి స్థానిక పోలీసుల కు మిస్సింగ్ కేసు కింద దరఖాస్తు ఇచ్చారు. పార్వతి పురం ప్రాంతానికి చెందిన పుట్టి సుజాత జేపీ కాలనీలో నివాసం ఉంటూ టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. రెండు మూడు రోజుల క్రితం ఇంట్లో ఆమె కొడుకు పుట్టి వరుణ్ (13), స్థానిక ప్రవేట్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నారు. చదువు విషయంలో చిన్న గొడవ జరిగిందీ. టీ సీ విషయంలో జరిగిన ఈ గొడవ రెండు రోజుల తర్వాత సద్దు మణిగింది. అయితే మంగళ వారం వరుణ్ స్కూల్ కి వెళ్తున్నా అని చెప్పి వెళ్ళలేదు. అన్నీ చోట్లా వెతికిన ఫలితం లేకుండా పోయింది. చివరకు తల్లి సుజాత పటాన్ చెరు పోలీసుల కు పిర్యాదు చేసింది. ఆమె పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**గజ్వేల్ ప్రతినిధి, ఆగస్టు 11,**

గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా నమోదైన కేసులను మంగళవారం ప్రిన్సిపల్ జేఎఫ్‌సీఎం కోర్టు, గజ్వేల్లో విచారించగా మొత్తం 15 కేసులు పరిష్కరించ బడ్డాయి. ఇందులో 6 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు మొత్తం రూ.60 వేలు జరిమానా విధించబడింది. వీరిలో ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి మూడు రోజుల జైలు శిక్ష విధించబడింది. జైలు శిక్ష పొందిన వారు.. నీరుగొండి కర్ణాకర్ (29), వ్యవసాయం, వేములగట్టు, గజ్వేల్ మండలం. కొత్తపల్లి వైకుంఠం (55), వ్యవసాయం, లింగాపూర్, తొగుట మండలం. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఏడు కేసుల్లో మొత్తం రూ.35 వేలు జరిమానా విధించబడింది. మొత్తంగా 15 కేసులు పరిష్కరించగా, రూ.95 వేలు జరిమానా విధించబడింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉన్నందున, వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. అలాగే వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ కోరారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ తలుపులమ్మ అమ్మవారి బోనాల జాతర వేడుకలు

## ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేసిన బండి రమేష్



**కూకట్ పల్లి ప్రతినిధి, ఆగస్టు 11,**

కూకట్పల్లి ప్రశాంత్ నగర్ లోని శ్రీశ్రీశ్రీ తలుపులమ్మ తల్లి, నీలమణి దుర్గమ్మ తల్లి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి బోనాల జాతర కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సంతోషం, ఆరోగ్యం కలగాలని బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ చంద్రరావు, నాగార్జున, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వాసు, రమణ, పాల్గుణరావు, కామినేని వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ భేటీ.



**కూకట్ పల్లి ప్రతినిధి, ఆగస్టు 11**

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ గాంధీభవన్లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి గంప వేణుగోపాల్ లతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా జరిగిన సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీలకంగా వ్యవహరించిందని ముఖ్యంగా కూకట్పల్లి నియోజకవర్గంలో బూత్ వారీగా బిఎల్ఎలను నియమించి సక్సెస్ చేశామని సావంత్ కి వివరించారు. ప్రజలకు దగ్గర కావడానికి దొంగ ఓట్లను గుర్తించడానికి బిఎల్ఎ వ్యవస్థ బాగా ఉపయోగ పడిందని బండి రమేష్ చెబుతూ కూకట్పల్లి సర్ ప్రక్రియ విషయాలను సచిన్ తో పంచుకున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు రానున్న కార్పొరేషన్ ఎన్నికలకోసం సిద్ధంగా ఉన్నట్లు సచిన్ సావంత్ కి బండి రమేష్ నివేదికలు అందించారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.